మినరల్ పేరిట బురిడీ

- తక్కువ ధరకే అంటగడుతున్న వైనం
- వాటర్ బాటిళ్లపై కనిపించే ఐఎస్ఐ మార్కు నకిలీనే
- ఒకే బ్రాండ్ పేరుతో అక్షరాలు మార్పు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పలమనేరు: గతంలో చేదబావులు, వాగులు, నదులు నీటిని తాగే మన పూర్వీకులు నిండు నూరేళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారు. కానీ నేటి తరం మినరల్ వాటర్ మోజులో పడి ఆ నీళ్లకు అలవాటుపడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న మినరల్ వాటర్ కంపెనీలు సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మనతో తాగిస్తున్నాయి. నకిలీ వాటర్ బాటిల్‌ను విక్రయిస్తే అధిక లాభాలు వస్తుండడంతో ఏ దుకాణంలో చూసినా డూప్లికేట్ బాటిళ్లు రాజ్యమేలుతున్నాయి. ఇవి తాగిన జనానికి గొంతు, శ్వాసకోశ సమస్యలు, జలుబు లాంటివి షరామామూలుగా మారాయి. పట్టణాలే కాదు గ్రామాల్లోనూ మినరల్ వాటర్ పేరిట బోరు నీటినే ట్యాంకర్లలో తెచ్చి క్యాన్ రూ.20గా అమ్ముతూ ప్రజల ఆరోగ్యంతో కొందరు చెలగాటమాడుతున్నారు.

ఊపందుకున్న వ్యాపారం

పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో మినరల్ వాటర్ బాటిళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రజలు సైతం మినరల్ వాటరంటూ ఈ నీళ్లకే అలవాటు పడ్డారు. దుకాణాలు, హోటళ్లు, దాబాల్లో సాధారణ నీటికి బదులు మినరల్ వాటర్‌నే విక్రయిస్తున్నారు. కానీ ఈ బాటిళ్లను తయారుచేసే నిర్వాహకులు ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలను ఏమాత్రం పాటించకుండా రకరకాల బ్రాండ్ల పేరుతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. దుకాణదారులు సైతం ఈ నకిలీ బ్రాండ్లు తక్కువ ధరకే లభిస్తున్నందున వీటని కొని జనానికి తాపిస్తున్నారు. ఇక మండల కేంద్రాలతో పాటు స్థానిక మున్సిపాలిటీలో సైతం దీంతో ఎడాపెడా వాటర్‌ప్లాంట్లు, ఇళ్లవద్దే నీటిని విక్రయించే ట్యాంకు ఆటోలు పట్టణాలతో పాటు పల్లెల్లోనూ పెరిగాయి. ప్రజల అలవాటును గమనించి కొందరు నిబంధనలకు విరుద్ధంగా వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. వీటిల్లో దేనికి ఐఎస్ఐ ఉందో దేనికి లేదో కూడా తెలియని అయోమయం నెలకొంది. సాధారణ నీటినే ట్యాంకర్లతో తెచ్చి మినరల్ వాటర్ అని చెప్పి ఏమార్చేస్తున్నారు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు తప్పడం లేదు.

స్పెల్లింగ్ మార్చి మోసం

మినరల్ వారట్ బ్రాండ్ అయిన కిన్‌లే పేరు కనిపించేలా స్పెలింగ్ మార్చి జనాన్ని ఏమార్చుతున్నారు. బిసెలరీ ఒరిజినల్ బ్రాండ్‌ను మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అక్వాఫినాకి బదులు నకిలీ పేర్లను వాడుతున్నారు. ఈ విషయం తెలియని చాలామంది ఇది అసలైందే అనుకొని కొని తాగుతున్నారు.

నిబంధనలు గాలికి

ఎవరైనా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు దరఖాస్తు చేసుకోవాలి లేదా ఐఎస్ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూట్) ద్వారా అనుమతులు పొందాలి. అన్ని సంతృప్తికరంగా ఉంటే ఆ వాటర్ మాత్రమే ఐఎస్ఐ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. ఈ ప్లాంటుకు సంబంధించిన అనుమతి, స్ట్రక్చర్ అనుమతులను సంబంధిత పంచాయతీలు, మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా ఇవ్వడమే ఈ దోపిడీకి కారణమవుతోందనే మాట గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికైనా ఈ అక్రమాలపై జిల్లా యంత్రాంగం స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

పలమనేరు డివిజన్‌లో వందకుపైగా మినరల్ వాటర్ ప్లాంట్ యూనిట్లు ఉన్నాయి. వీటి నుంచి నీటిని క్యాన్లకు రీటైల్‌గా విక్రయిస్తున్నారు. వీటిని శుద్ధి చేశారా లేదా అనే సంగతి ఎవరికీ తెలియదు. అసలు వాటర్‌ప్లాంట్లు లేకనే కొందరు బోర్లలో నీటని నింపి మినరల్ వాటర్ పేరిట విక్రయించే ట్యాంకర్లు వందకుపైగా ఉన్నాయి. అయితే ఈ నీళ్ల తయారీ నిబంధనల మేరకు సాగడం లేదు. నీటి నాణ్యత గురించి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వీరు విక్రయించే నీళ్లను జనం తాగి ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ వాటర్‌ప్లాంట్ల వ్యవహారాన్ని తేల్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహారకల్తీ నిరోధ కశాఖ ఫుడ్ కంట్రోలర్‌లు, మున్సిపాలిటీ అధికారులు, సంబందిత పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

నాణ్యత లేకుంటే ఫిర్యాదు చేయండి



నాణ్యత లేని నీటి ప్యాకెట్లు, బాటిళ్లు, వాటర్ ప్లాంట్లపై 9440379755 అనే టోల్‌ఫ్రీ నంబరుకు ప్రజలు ఫిర్యాదు చేయాలి. నిబంధనలు పాటించని కంపెనీలు, వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని వాటర్‌ప్లాంట్లపై తనిఖీలు చేయాలని ఇప్పటికే ఫుడ్‌సేఫ్టీ అధికారులను ఆదేశించాం.

–విద్యాధరి, జేసీ, చిత్తూరు

క్లుప్తంగా

పెరటాసి పూజలు



సదుం: ప్రత్యేక అలంకారంలో శ్రీవారు

సదుం: పవిత్ర పెరటాసి మూడో శనివారం పురస్కరించుకుని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, పాదాలకు పూజలు చేశారు. తిరునామాలు ధరించి, ఉపవాస దీక్షలు చేశారు. బూరగమంద భూదేవీ, శ్రీదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోను పూజలు నిర్వహించారు.

గోపుర కలశ ప్రతిష్ట



కలశ ప్రతిష్ట చేస్తున్న వేదపండితులు

బైరెడ్డిపల్లె: మండలంలోని దాసార్లపల్లెలో కొత్తగా నిర్మించిన శ్రీముత్యాలమ్మ, శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో శనివారం వైభవంగా గోపుర కలశ స్థాపన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



డ్రాప్ అవుట్స్ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టీచర్లు

కుప్పంరూరల్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అడవిబూదుగూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చిట్టిబాబు అన్నారు. శనివారం పాఠశాల పరిధిలోని యానాదికాలనీలో డ్రాప్ అవుట్స్ పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. వలస కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన పిల్లలను ఇద్దరిని శనివారం పాఠశాలలో చేర్పించారు. చిట్టిబాబు మాట్లాడుతూ చదువు తలరాతను మారుస్తుందని, తల్లిదండ్రులు తప్పక పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. వెంకట్రాయశెట్టి, లోకనాథం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడా దుస్తులను అందజేస్తున్న రోసా సభ్యులు

రొంపిచెర్ల: మండలంలో గత రెండేళ్లలో పదో తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు రూ.1.24 లక్షల ఉపకార వేతనాలను పూర్వ విద్యార్థుల యూనియన్ అందజేసినట్లు రోసా అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి శనివారం తెలిపారు. రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఆరుగురు, బాలికల ఉన్నత పాఠశాలలో నలుగురు, రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాల, బొమ్మయ్యగారిపల్లె, పెద్దమల్లెల, గానుగచింత, కేజీబీవీ పాఠశాలలో ఇద్దరు చొప్పున మొత్తం ఇరవై మంది విద్యార్థులకు ఈ ఉపకాల వేతనాలు అందజేశారు. రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠవాలలో 12 మంది విద్యార్థులకు రూ.6,750 విలువ కలిగిన క్రీడా దుస్తులు ప్రదానం చేశారు. పూర్వ విద్యార్థుల యూనియన్‌కు రవీంద్రనాథ రెడ్డి రూ.5000, ప్రదీప్ కుమార్ రూ.20,000, కేసర్ల గోపాలకృష్ణ రూ.5000, హరిప్రసాద్ రూ.5000 విరాళాలుగా అందజేసినట్లు తెలిపారు.

సార్వత్రిక విద్యను ప్రోత్సహిద్దాం

పులిచెర్ల (కల్లూరు): గతంలో సౌకర్యం ఉన్నా చదువుకోలేని వారి కోసం ప్రభుత్వం సార్వత్రిక విద్య ప్రవేశ పెట్టిందని దీనిపై పల్లెల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్లలో శనివారం వారు సార్వత్రిక విద్యపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. చదువుకోలేని వారు, 10 ఉత్తీర్ణత సాధించి ఇంటర్ చదవాలనుకున్న వారికి ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

స్వచ్ఛ పంచాయతీగా కెనమాకులపల్లి



ఎంపీడీఓ

శాంతిపురం: రాష్ట్ర స్థాయి స్వచ్ఛ గ్రామ పంచాయతీగా మండలంలోని కెనమాకులపల్లి ఎంపికైనట్లు ఎంపీడీఓ ఏపీ ఆర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6న విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం ద్వారా అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. చెత్త సేకరణ కోసం మండలంలోని అన్ని పంచాయతీలకు ఒక్కోటి రూ.3 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మొత్తం 60 మంది క్లాప్ మిత్రలను నియమించడంతో పాటు వీరి గౌరవ వేతనం కోసం ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.50 లక్షలు రిజర్వులో ఉంచామని తెలిపారు. వర్మి కంపోస్టు తయారీ సాగుతోందని, ఆయా కేంద్రాల మరమ్మతులకు రూ.10 లక్షల జెడ్పీ నిధులను వ్యయం చేశామని పేర్కొన్నారు.

వైభవం.. శ్రీనివాసుని కల్యాణం

- గోవింద నామస్మరణతో మార్మోగిన బేటరాయస్వామి కొండ

కుప్పంరూరల్: ప్రతి ఏడాది టీటీడీ ఆధ్వర్యంలో కుప్పం మండలం, బేటరాయస్వామి కొండపై నిర్వహించే శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. ఏటా పెరటాసి నెల మూడవ శనివారం బేటరాయ స్వామి కొండపై వెలసిన శ్రీ వేట వెంకరమణ స్వామి ఆలయ ఆవరణలో టీటీడీ వారి ఆధ్వర్యంలో శనివారం కల్యాణోత్సవం నిర్వహించారు. టీటీడీ అర్చకులు ఉదయాన్నే కొండ ఆవరణకు చేరుకుని స్వామి వారి ప్రతిమలను ఏర్పాటు చేసి కల్యాణోత్సవం ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చరణతో కొండ మొత్తం పులకించింది. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు టీటీడీ పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల గోవింద నామస్మరణతో కొండ మార్మోగింది.



శ్రీనివాసుని కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

దుర్గా మాత ప్రతిమల ఊరేగింపు

కుప్పం: నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన దుర్గామాత ప్రతిమలను 13వ రోజు శనివారం పట్టణ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. పలక వాయిద్యాల మధ్య ట్రాక్టర్లలో అమ్మవారి ప్రతిమలను వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో అమ్మవారిని నిమజ్జనం చేశారు.



పుర వీధుల్లో విహరిస్తున్న అమ్మవారు

సరోజమ్మ మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



నివాళులర్పిస్తున్న వెంకటేగౌడ

వి.కోట: ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యువరాజు తల్లి సరోజమ్మ మరణం తీరనిలోటని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం ఎంపీపీ యువరాజు తల్లి సరోజమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతమాకులపల్లి పంచాయతీ పసలమంద గ్రామంలోని ఎంపీపీ స్వగృహానికి చేరుకుని భౌతికకాయాలనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నేతలు ఉన్నారు.

స్వచ్ఛ అవార్డుకు ఎంపికైన కమ్మపల్లె పాఠశాల

పులిచెర్ల(కల్లూరు): జిల్లాలో స్వచ్ఛ పాఠశాలగా మండలంలోని కమ్మపల్లె మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపికైందని ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. గాంధీ జయంతి రోజు ఈ పాఠశాల ఎంపికను ప్రకటించారు. మండలంలో ఇది స్వచ్ఛ పాఠశాలగా నిలవడానికి అన్ని సౌకర్యాలు కలిగి ఉండడమే. పాఠశాల శుభ్రత, తాగునీరు, మరుగు దొడ్లు, ఆహ్లాదకర వాతావరణం, మొక్కల పెంపకం వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో ఈ పాఠశాల జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైందన్నారు.

రేపటి నుంచి రీసర్వే

చౌడేపల్లి: మండలంలోని ఏ.కొత్తకోట, పందిళ్లపల్లె, 29ఏ చింతమాకులపల్లె రెవెన్యూ గ్రామాల్లో సోమవారం నుంచి రీసర్వే కోసం గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పార్వతి శనివారం తెలిపారు. నాలుగో విడత రీసర్వేలో భాగంగా మూడు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, కాలువలు, చెరువులతో పాటు ప్రభుత్వ స్థలాలను గుర్తించి తొలుత వాటిని రీసర్వే చేస్తున్నామని చెప్పారు. గ్రామసభలకు రైతులు, ప్రజలు హాజరు కావాలని తెలిపారు. రీసర్వే కోసం వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు నగదు బహుమతి ఇస్తున్న ఎంపీపీ

బైరెడ్డిపల్లె: అగస్త్రీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఎం.కొత్తూరులో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లోని విజేతలకు ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా కమ్మనపల్లె జట్టు రూ.30వేలు, రెండవ బహుమతిగా టి.ఎన్.కుప్పం జట్టు రూ.20వేలు, మూడవ బహుమతిగా మునిపల్లె జట్టు రూ10వేలు కైవసం చేసుకున్నారు. విజేత జట్లను అభినందించారు.

ముగ్గురికి ఏఓలుగా ఉద్యోగోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి ఏవోలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు శనివారం జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని చౌడేపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుకన్యను సదుం మండలం ఏఓగా నియమించారు. పలమనేరు పీఐయూలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న శాంతిని పాకాల ఏఓగా, జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డిని రామచంద్రాపురం ఏఓగా ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగులు జారీచేశారు.

అధికారం లేకున్నా ప్రజలతోనే!



మండలంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అధికారంతో సంబంధం లేకుండా ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వాటిని పరిష్కరించడానికి ఎల్లప్పుడు కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం మండలంలోని పలు పంచాయతీలలో ఆయన నాయకులతో కలిసి పర్యటించారు. మండలంలోని ఎర్రినాగేపల్లిలో సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి నడవడానికి వీలులేకుండా కుంటను తలపిస్తున్న సమస్యను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నాణ్యతా లోపంతో నిర్మించడంతో ఈ సమస్య తలెత్తిందని సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని ఆళ్వారిపల్లిలో నూతనంగా నిర్మించిన మల్లమ్మతల్లి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. గ్రామస్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, నేత ఇంద్రేష్ పాల్గొన్నారు.

పరామర్శ

గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాల్లో ఇటీవల అనారోగ్య కారణాలతో పలువురు మృతిచెందారు. గతంలో జరిగిన ప్రమాదాల్లో కొంతమంది గాయపడి ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ కుటుంబాలను శనివారం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పరామర్శించారు. అదేవిధంగా కొందరి ఇళ్లల్లో జరిగిన శుభకార్యాల్లో పాల్గొన్నారు. మారేడుపల్లి గ్రామంలో దిగువూరులో భాస్కర్‌రెడ్డి ఇంటికి, కెసి.పెంట గ్రామంలో బాబు, జరావారిపల్లిలో జగదీశ్వర్‌రెడ్డి, మన్నార్‌నాయనిపల్లిలో గంగరాజు, కలగటూరు గ్రామంలో మురళి రెడ్డి, కల్లుపల్లిలో రెడ్డెప్పరెడ్డి ఇళ్లకు వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పలువురి శుభకార్యాల్లో పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమమే లక్ష్యం



గంగవరం: చెక్కు ఇస్తున్న డీసీసీబీ చైర్మన్



కుప్పం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

గంగవరం: ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆటో, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లతో పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఆర్థికసాయంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆటోరిక్షా డ్రైవర్లకు ఆర్థిక సాయం

పుంగనూరు: ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటారు క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం శాప్ చైర్మన్ రవినాయుడు పంపిణీ చేశారు. డ్వామా పీడీ రవికుమార్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

574 మందికి సేవా పథకం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో 574 మంది ఆటోడ్రైవర్ల సేవా పథకం లబ్ధిపొందినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. శనివారం పట్టణంలో చెరువు కట్ట నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఆటోడ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సేవా పథకం ప్రతిఒక్కరినీ ఆదుకుంటుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో 574 మందికి రూ.86 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీఎంకే వుడా చైర్మన్ డా.సురేష్ బాబు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ సమావేశం

పుంగనూరు: ఎస్‌డీపీఐ పార్టీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు యూసఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రజల సమస్యలను గుర్తించేందుకు మనవార్డు మన బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్ధిక్, ఆసిఫ్, ఖాదర్‌బాషా, షామీర్‌బాషా, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నీట మునిగిన పంట

పెద్దపంజాణి: మండలంలో శనివారం వేకువజామున 2 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ కుండపోతగా కురిసిన వర్షంతో టమాట పంటకు నష్టం వాటిల్లింది. లింగాపురం పంచాయతీ గడ్డంవారిపల్లి సమీపంలో టమాట పంట నీటమునిగింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని పెద్ద చెరువుల్లో ఒకటైన కొళత్తూరు సమీపంలోని రాయలచెరువు పూర్తిస్థాయిలో నిండి రోడ్డుపై మొరవ పారుతోంది. దీంతో కొలత్తూరు-నగిరేపల్లి మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలో 108 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు.



సదుం: ఒరిగిన విద్యుత్ స్తంభం



కౌండిన్య నదిలో పొంగి ప్రవహిస్తున్న నదీ ప్రవాహం

గంగవరంలో..

గంగవరం: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు బాగా దెబ్బతిన్నాయి. నదులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల్లో వరద ప్రవాహాలు జోరుగా సాగుతున్నాయి. కౌండిన్య నదీ ప్రవాహం ఉప్పొంగి ప్రవహిస్తోంది.

భారీ వర్షం

రొంపిచెర్ల/సదుం: రొంపిచెర్ల, సదుం మండలాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. రోడ్ల మీద ఎక్కడ చూసిన వర్షపు నీరు ప్రవహించింది. వ్యవసాయ పొలాల్లో నీరు నిలిచి పోయింది. టమాట పంట దెబ్బ తినే అవకాశం ఉందని రైతులు తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని తాటిమాకులకుంట చెరువు మొరవ పోతోంది. సదుం మండలంలో గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తోంది. తుమ్మగుంటపల్లెలో రెండు, గొడ్లవారిపల్లె సమీపంలో, అమ్మగారిపల్లె పరిధిలో ఒక్కో విద్యుత్ స్తంభం చొప్పున మొత్తం నాలుగు స్తంభాలు దెబ్బతిన్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.



రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లెలోని పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



రొంపిచెర్ల: సాయిబాబా గుడి రోడ్డుపై నిలిచిన నీరు